# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 04 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4


## హైకోర్టుకు నలుగురు జడ్జిలు

- సుప్రీం కొలీజియం సిఫారసు




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు కు నలుగురు జడ్జిలు రానున్నారు. జూలై 1, 2 వ తేదీల్లో సిజెఐ బిఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్ నాథ్‌లతో కూడిన కొలిజి యం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుప్రీం కోర్టు కోలీజియం రాష్ట్రానికి న లుగురు న్యాయమూర్తులను నియమిస్తూ నిర్ణ యం తీసుకున్నారు. ఈ మేరకు నూతనంగా జస్టిస్ గౌసి మేరామోహిదుద్దిన్, జస్టిస్ చలపతిరావు సుద్దాల, జస్టిస్ వాకాటి రామకృష్ణా రెడ్డి, జస్టిస్ గాది ప్రవీణ్ కుమార్‌లు హైకోర్టు జడ్జిలుగా బాధ్యతలు చేపట్టనున్నారు.

# తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి కట్టుబడున్న ప్రభుత్వం

- 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి రంగం సిద్ధం
- హైదరాబాద్‌ను ప్రపంచ వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- ఇన్వెస్టర్లకు లాభదాయక వాతావరణం కల్పించడమే లక్ష్యం
- వివిధ రంగాల పరిశ్రమలకు పూర్తి సహకారం
- సీఎం రేవంత్ రెడ్డి
- మలబార్ జెమ్స్ అండ్ జ్యువెల్లరీ యూనిట్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రం పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అన్నారు. మహేశ్వరం జనరల్ పార్క్‌లో మలబార్ గ్రూపు ఏర్పాటు చేసిన జెమ్స్ అండ్ జ్యువెల్లరీ యూనిట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలకు అవసరమైన ప్రోత్సాహకాలు, రక్షణతో పాటు లాభదాయకమైన వాతావరణం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

### పెట్టుబడులకు గారెంటీ - అభివృద్ధికి భరోసా

"హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి వ్యాపార నగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తోంది. నాలుగో నగరంగా మహేశ్వరం వద్ద భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మించనున్నాం. దాదాపు 30 వేల ఎకరాల్లో అత్యాధునిక మౌలిక సదుపాయాలతో స్మార్ట్ సిటీ అభివృద్ధి జరుగుతుంది," అని సీఎం తెలిపారు.

### 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ డిసెంబర్ 9న

రాబోయే వందేళ్లకు రాష్ట్రానికి అవసరమైన అభివృద్ధి ప్రణాళికలతో రూపొందిస్తున్న 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ఈ డిసెంబర్ 9న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. సింగపూర్ సహా ఇతర దేశాల కన్సల్టెంట్ల సాయంతో ఈ డాక్యుమెంట్ రూపొందించబడుతున్నదని వెల్లడించారు.

### తెలంగాణ - ఐటీ, ఫార్మా 'లెజెండ్'

"తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే ఐటీ, ఫార్మా రంగాల్లో దేశంలో ముందంజలో ఉంది. దేశంలో 35 శాతం బల్క్ డ్రగ్ ఉత్పత్తి హైదరాబాద్ నుంచే జరుగుతోంది. ఇప్పుడు బంగారం రంగంలోనూ అదే పేరును తీసుకొచ్చేందుకు మలబార్ యూనిట్ తోటి ముందడుగు వేసింది" అని సీఎం పేర్కొన్నారు.

### ప్రతిష్టాత్మకంగా మలబార్ బంగారం యూనిట్

ప్రపంచ స్థాయి బంగారం సంస్థ మలబార్ గోల్డ్ రాష్ట్రాన్ని నమ్మి ఇక్కడ యూనిట్ ప్రారంభించడం సంతోషకర పరిణామమని, ఇది పెట్టుబడులకు తెలంగాణ సరైన రాష్ట్రమని మరోసారి నిరూపించిందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహమ్మద్, వైస్ చైర్మన్ అబ్దుల్ సలాం తో పాటు పలువురు పారిశ్రామిక ప్రముఖులు పాల్గొన్నారు.

### కొత్త పరిశ్రమలకు 4,200 దరఖాస్తులు : మంత్రి శ్రీధర్ బాబు

తెలంగాణలో తయారీ రంగంలో అభివృద్ధి ఎక్కువగా ఉందని, ప్రస్తుతం 9 శాతానికిపైగా వృద్ధి సాధిస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మహేశ్వరంలోని ఇండస్ట్రియల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన 'మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ' తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త పరిశ్రమలకు 4,200 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తు అందిన 15 రోజుల్లోనే 98 శాతం దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని తెలిపారు.

## మాజీ సీఎం కేసీఆర్‌కు అనారోగ్యం

- యశోద ఆస్పత్రిలో వైద్య పరీక్షలు
- కేసీఆర్ ఆరోగ్యంపై సీఎం రేవంత్ రెడ్డి ఆరా



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) గురువారం సాయంత్రం స్వల్ప అనారోగ్యానికి గురయ్యారు. ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో ఆయనను సోమాజిగూడలోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు కేసీఆర్‌కు విస్తృతంగా వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నారని తెలిసింది. ప్రస్తుతానికి ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వైద్య వర్గాలు తెలిపాయి.కేసీఆర్ వెంట భార్య శోభ, కుమారుడు కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు హరీష్ రావు, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఉన్నారు.

### హెల్త్ బులిటెన్ విడుదల

కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి వైద్యులు బులిటెన్ విడుదల చేశారు. "కేసీఆర్ నీరసంగా ఉండటంతో ఈ సాయంత్రం ఆస్పత్రిలో చేరారు. ఆయన శరీరంలో బ్లడ్ షుగర్ అధికంగా, సోడియం మోతాదు తక్కువగా ఉన్నట్లు ప్రాథమిక పరీక్షల్లో వెల్లడైంది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది" అని పేర్కొన్నారు.

### కేసీఆర్ ఆరోగ్యంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా..

మరోవైపు, కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. సోమాజీగూడ యశోద ఆస్పత్రి వైద్యులు, అధికారులతో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌కు అత్యుత్తమ చికిత్స అందించాలని సూచించారు. ఆయన త్వరగా కోలుకోవాలని.. సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

## తెలంగాణ ప్రజలకు రాహుల్ తీరని ద్రోహం

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 2014 విభజన చట్టంలోని హామీల అమలుపై రాహుల్ ఎప్పుడూ మోడీ ప్రభుత్వాన్ని నిలదీయలేదని, తెలంగాణ ప్రజలకు ఆయన తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. "ఎంత పెరిగినా గొర్రెకు బెత్తడే తోక అన్నట్లు, రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా సాధించినదేమీ లేదు. తెలంగాణ సమస్యలు, హక్కులు ఎప్పుడూ ఆయన మాటల్లో కనబడలేదు," అని అన్నారు.బనకచర్ల ప్రాజెక్టు విషయంలో రాహుల్ గాంధీ మౌనం కుట్రలతో సమానం అని పేర్కొన్న కేటీఆర్, "గోదావరి జలాల్లో తెలంగాణకు న్యాయం జరగకుండా చూస్తూ చంద్రబాబుకు వాటా ధారాదత్తం చేస్తున్న రేవంత్ రెడ్డి కుట్రకు రాహుల్ గాంధీ కూడా పాలుపంచుకుంటున్నారు," అని ఆరోపించారు.విభజన చట్టంలోని కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల జాతీయ హోదా, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఐటీఐఆర్ వంటి అంశాలపై రాహుల్ ఒక్క మాట మాట్లాడలేదని తెలిపారు. "2015లో ఐటీఐఆర్‌ను రద్దయినప్పుడు కేంద్రానికి వత్తాసు పలికింది కాంగ్రెస్" అని ఎద్దేవా చేశారు. అలాగే కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, సింగరేణి బొగ్గు బ్లాక్‌లు వంటి అంశాల్లో తెలంగాణపై జరుగుతున్న అన్యాయాన్ని కూడా రాహుల్ గాంధీ ఎప్పుడూ లేవనెత్తలేదని విమర్శించారు.

"అమలుచేయలేని హామీలు ఇచ్చిన రేవంత్ రెడ్డి చతికిలపడితే, రాహుల్ గాంధీ మాత్రం తెలంగాణకు రావడం మానేశారు. ప్రజలతో చేసిన వాగ్దానాలపై తనదే గ్యారంటీ అని చెప్పిన ఆయన ఇప్పుడు ముఖం చాటేశారు," అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ను గెలిపించిన తెలంగాణ ప్రజలకు రాహుల్ గాంధీ ఇచ్చిన శాపమే ఈ రేవంత్ సర్కార్ అని కేటీఆర్ విమర్శించారు.

## హ్యామ్ రోడ్లను ఫైనల్ చేశాం

- ఆగస్టు చివరినాటికి అగ్రిమెంట్ పూర్తి, సెప్టెంబర్‌లో పనులు ప్రారంభం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలకమైన హ్యామ్ రోడ్ల ప్రాజెక్ట్ త్వరలో ప్రారంభమవుతుందని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. గురువారం ఎర్రమంజిల్‌లోని ఆర్ అండ్ బీ కార్యాలయంలో హ్యామ్ రోడ్ల ప్యాకేజీపై సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి, అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "హ్యామ్ రోడ్ల పనులను ఫైనల్ చేశాం. త్వరలోనే టెండర్లు పిలుస్తాం. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డితో చర్చించి ఆగస్టు నెలాఖరు వరకు అగ్రిమెంట్‌ను పూర్తి చేస్తాం. సెప్టెంబర్ నుంచి పనులు ప్రారంభిస్తాం" అని పేర్కొన్నారు. హ్యామ్ మోడల్‌లో రోడ్ల నిర్మాణం ఎనిమిది రాష్ట్రాల్లో జరుగుతోందని, తెలంగాణలో కూడా దీని ద్వారా రాష్ట్ర రూపురేఖలు మారనున్నాయని మంత్రి స్పష్టం చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 42 బ్రిడ్జిలను ఎలాంటి ఆమోదం లేకుండా వదిలేసిందని ఆరోపించిన మంత్రి కోమటిరెడ్డి, "ఆర్ అండ్ బీ శాఖలో వివాదాలకందకుండా పోస్టింగ్‌లు, ప్రమోషన్‌లు ఇచ్చాం. గత ప్రభుత్వం కనీసం అసిస్టెంట్ ఇంజినీర్‌ల నియామకాన్ని కూడా చేయలేదు" అన్నారు. "రహదారులు ప్రజల కోసమే వేస్తాం, మనకు పేరు కోసం కాదు. వచ్చే మూడున్నరేళ్లలో రాష్ట్రంలో 12 వేల కిలోమీటర్ల రోడ్లు పూర్తి చేస్తాం. రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య తెలుగు రాష్ట్రాల్లో అధికంగా ఉంది" అని మంత్రి వివరించారు.


### ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుకు అనుమతులు తెస్తాం

కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల ఆన్ గోయింగ్ పనుల కోసం రూ.300 కోట్లు విడుదల చేశారని కోమటిరెడ్డి తెలిపారు. "ఈ నెలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గడ్కరీలను కలిసి ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుకు అనుమతులు తీసుకువస్తాం. ఈ ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేయడమే లక్ష్యం" అని పేర్కొన్నారు.

గతంలో మాజీ సీఎం కేసీఆర్ ఆర్అండ్‌బీ శాఖను పట్టించుకోలేదని విమర్శించిన ఆయన, ప్రస్తుతం ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తుందని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావు, ఈఎన్సీ టీ. జయ భారతి, సీఈలు మోహన్ నాయక్, లక్ష్మణ్, రాజేశ్వర్ రెడ్డి, ఇతర ఎస్ఈలు, ఈ.ఈలు, ఏ.ఈలు పాల్గొన్నారు.

## రూ. 1.05 లక్షల కోట్ల విలువైన సైనిక పరికరాల కొనుగోలుకు ఆమోదం

- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో డీఏసీ సమావేశం
- పూర్తిగా దేశీయ కంపెనీల నుంచే సేకరణ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారత రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞానాన్ని ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో భారీ ముందడుగు వేసింది. సుమారు రూ. 1.05 లక్షల కోట్ల విలువైన సైనిక పరికరాలు, ఆయుధ వ్యవస్థల కొనుగోలుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఉన్న రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) గురువారం ఆమోదం తెలిపింది. ఈ కొనుగోళ్లన్నీ పూర్తిగా దేశీయ కంపెనీల నుంచే చేపట్టనుండటం 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి పెద్ద ఊతంగా నిలవనుంది. ఈ సమావేశంలో త్రివిధ దళాల అవసరాల కోసం క్షిపణులు, ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలు (ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సిస్టమ్స్), ఆర్మర్డ్ రికవరీ వాహనాలు, ఇంటిగ్రేటెడ్ కామన్ ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వంటి 10 కీలక ప్రతిపాదనలకు 'అవసర ఆమోదం' లభించింది. వీటితో పాటు నౌకాదళం కోసం మైన్ కౌంటర్ మెజర్ వెస్సెల్స్, సూపర్ ర్యాపిడ్ గన్ మౌంట్ వంటి అత్యాధునిక పరికరాలను కూడా సేకరించనున్నారు. ఈ కొత్త ఆయుధాలు, వ్యవస్థల చేరికతో త్రివిధ దళాల కార్యాచరణ సామర్థ్యం మరింత పటిష్ఠం కానుందని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఇటీవల కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) వివరాలు 2వ పేజీలో

## తెలుగు సినిమాల పైరసీ.. నిందితుడి అరెస్టు

- ట్విట్టర్‌లో మీమ్ చూసి పైరసీ ప్రారంభించిన నిందితుడు
- థియేటర్‌ల్లోనే మొబైల్‌తో రికార్డింగ్ - రూ.80 వేల చెల్లింపులు
- క్రిప్టో కరెన్సీ ద్వారా డబ్బులు
- బ్యాంక్ ఖాతాల మార్గంలో నగదు మళ్లింపు
- టాలీవుడ్‌కు రూ.3,700 కోట్ల నష్టం .. టీఎఫ్సీసీ ఫిర్యాదు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కొత్త సినిమాలను పైరసీ చేస్తున్న నిందితుడిని హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన జానా కిరణ్ కుమార్, నగరంలోని వనస్థలిపురంలో నివసిస్తూ ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న కిరణ్, ట్విటర్‌లో చూసిన ఓ మీమ్ ద్వారా "కొత్త సినిమాలను రికార్డు చేసి పంపితే భారీగా డబ్బులు వస్తాయంటూ" వచ్చిన సందేశాన్ని చూసి, 1తమిళ్‌ఎంవి అనే పైరసీ గ్రూపును సంప్రదించాడు. ఆ తర్వాత నిందితుడు థియేటర్లలో విడుదలైన సినిమాలను మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసి, తమిళ్‌బ్లాస్టర్స్, 5మూవీరూల్స్, 1తమిళ్‌ఎంవి వంటి టెలీగ్రాం గ్రూపులకు పంపుతూ ఒక్కో సినిమాకు రూ.80,000 తీసుకుంటున్నాడు. చెల్లింపులు క్రిప్టో కరెన్సీ రూపంలో జరిగాయి.

ఇప్పటివరకు 40కు పైగా టాలీవుడ్ సినిమాలను రికార్డు చేసి పైరసీ గ్రూపులకు పంపించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ డబ్బులను వివిధ బ్యాంక్ ఖాతాలకు మళ్లించి, తిరిగి నగదు రూపంలో విత్‌డ్రా చేస్తున్నాడు. ఏడాదిన్నర కాలంగా ఈ అక్రమ కార్యకలాపాలు సాగుతున్నాయి. 2024లో పైరసీ కారణంగా టాలీవుడ్ పరిశ్రమకు రూ.3,700 కోట్ల మేర నష్టం వాటిల్లిందని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ తరఫున మహీంద్ర బాబు హైదరాబాద్ సైబర్ క్రైంకు జూన్ 5న ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడిపై ఐటీ యాక్ట్ 66(సి), 66(ఈ), 318(4) రెడ్ విత్ 3(5), 338 %దీమీ% 63, 65, కాపీరైట్ యాక్ట్ 6AA, 6AB, 7(1A) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్సై మన్మోహన్ గౌడ్, హెడ్ కానిస్టేబుల్ ఎం. ఫిరోజ్, రాకేష్ సాగర్, తిరుమలేష్ తదితరులు ఉన్నారు.

## హైకోర్టులో గ్రూప్ -1 పిటిషన్లపై విచారణ వాయిదా

వివరాలు 2వ పేజీలో

## వరద ప్రవాహానికి ఆటంకాలు కలిగించొద్దు

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- వరద ముప్పు ప్రాంతాల్లో పర్యటించిన హైడ్రా కమిషనర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నాలాలు పొంగకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులకు సూచించారు. నాలాలకు ఉన్న ఆటంకాలన్నీ తొలగితే చాలా వరకు ముంపు సమస్య తలెత్తదన్నారు. వర్షాల వేళ.. నగరంలోని పలు ప్రధాన నాలాలు, ముంపు ఉన్న ప్రాంతాలను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు గురువారం పరిశీలించారు. నాలా ఆక్రమణలను ప్రత్యక్షంగా చూసి వెంటనే తొలగించడానికి ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాలు పడినప్పుడు మూసీ నదీ పరీవాహకం కంటే.. ఎక్కువ కూకట్‌పల్లి, జీడిమెట్ల నాలాలే ప్రమాదకరంగా మారుతున్నాయని గ్రహించామన్నారు. ఈ రెండు నాలాలు సాఫీగా సాగకపోవడంతో భరత్‌నగర్, మూసాపేట, బాలానగర్, జింకలవాడ, దీన్‌దయాల్‌నగర్, వినాయక్‌నగర్, కల్యాణ్ నగర్ ప్రాంతాలు నీట మునుగుతున్నాయని.. ఈ ఏడాది ముప్పు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

జీడిమెట్లలోని ఫాక్స్ సాగర్ నుంచి వచ్చే వరద కాలువ ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురై కుంచించుకుపోయిన విషయాన్ని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఫాక్స్ సాగర్ అలుగు కాలువ ఆనవాళ్లే లేకుండా పోయింది. జీడిమెట్ల ప్రాంతంలో ఆ కాలువ 30 మీటర్ల వెడల్పులో ఉంటే.. కల్వర్టుల వద్ద ఉన్న వెడల్పు కాలనీలు, బస్తీలకు వచ్చేసరికి లేకుండా పోయింది. బాలానగర్ జింకలవాడ, దీన్‌దయాల్‌నగర్ కల్వర్టు కింద 22 మీటర్లు వెడల్పుతో ఉన్న నాలా.. బస్తీలకు వచ్చేసరికి 10 మీటర్లకు పరిమితమైంది. వాస్తవానికి 22 మీటర్ల వెడల్పు, నాలకు ఇరువైపులా 9 మీటర్ల చొప్పున బఫర్‌ని కలిపి మొత్తం 40 మీటర్ల వెడల్పుతో వివరాలు 2వ పేజీలో

## మీనాక్షి నటరాజన్‌తో కొండా మురళీ దంపతులు భేటి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ వివాదాల నేపథ్యంలో కొండా మురళి. సురేఖ దంపతులుకాంగ్రెస్ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ తో భేటి అయ్యారు. తన వ్యాఖ్యలపై ఇంచార్జీ కి వివరణ ఇచ్చారు. ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ కి 16 పేజీల లేఖ సమర్పించారు. కాగా, కడియం శ్రీహరి, బసవరాజు సారయ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిలను పరోక్షంగా మురళీ విమర్శించారు. దీంతో ఆయే నేతలు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేశారు. ఈ వివాదాల నేపథ్యంలో నేడు మంత్రి కొండా సురేఖ, మురళీలు మీనాక్షిని కలసి తమ వాదనలను వినిపించారు. ఈ సందర్భంగా కొండా మురళీ మీడియాతో మాట్లాడుతూ, తాను వెనకబడిన వర్గాల ప్రతినిధినని.. నలభై నాలుగు ఏండ్ల నుంచి నా ఎపిసోడ్ నడుస్తూనే ఉందని అన్నారు.. ఒకరి గురించి నేను కామెంట్ చేయనంటూ తనకు ప్రజాబలం ఉందన్నారు.. తనకు భయపడకపోతే నాపై 23 కేసులు పెట్టకపోయేవాళ్ళుకాదన్నారు. పోటా, టడా కేసులకే తాను భయపడలేదని అన్నారు. .. వరంగల్ జిల్లా వివాదాలు ప్రస్తుతం క్రమశిక్షణ కమిటి పరిధిలో ఉన్నదని అన్నారు.. అయినా తనను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని వివరించారు. నాయిని రాజేందర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఇంచార్జ్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇక శుక్రవారం జరగబోయే మీటింగ్ పై చర్చించామన్నారు.. వరంగల్ నుంచి ఎంత మంది వస్తారు అనేది చర్చించామని పేర్కొన్నారు.. కాంగ్రెస్ పార్టీ నీ బ్రతికించడం, రాహుల్ గాంధీ నీ ప్రధాని చేయడం నా ఉద్దేశమని మురళీ అన్నారు. పని చేసే వాళ్లపైనే రాళ్ళ విసురుతారని పేర్కొన్నారు.. లోకల్ బాడీ ఎన్నికల్లో అన్ని కాంగ్రెస్ గెలిచేలా.. ఎమ్మెల్యేలను మళ్ళీ వరంగల్ లో గెలిపించడం నా బాధ్యత అన్నారు. తాను బీసీ కార్డు పైనే బ్రతుకుతున్నానని, రోజు 500 మంది ప్రజలకు భోజనం పెడతానని చెప్పారు. ప్రజల సమస్యలు తీర్చేందుకు ముందు ఉంటాను కాబట్టి ప్రజలు వస్తున్నారు.. ఎలాంటి గ్రూప్ రాజకీయాలతో తనకు సంబంధం లేదంటూ తన కుమార్తె ఎక్కడి నుంచి పోటీ చేయడం లేదన్నారు.

## క్రూడ్ పామాయిల్‌పై సుంకాన్ని పెంచాలి..



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని గతంలో మాదిరిగా 44 శాతానికి పెంచాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు లేఖ రాశారు. దిగుమతి సుంకాలు తగ్గించడంతో వంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడానికి ఏర్పాటు చేసిన జాతీయ వంట నూనెల మిషన్ లక్ష్యాలను చేరుకోలేమని లేఖలో పేర్కొన్నారు. కేంద్రం మే 31న క్రూడ్ పామాయిల్‌పై ఉన్న దిగుమతి సుంకాన్ని 27.5% నుంచి 16.5% కి తగ్గించిందని లేఖలో ప్రస్తావించారు.

## హైకోర్టులో గ్రూప్ -1 పిటిషన్లపై విచారణ వాయిదా

**బలగం టీవి, హైదరాబాద్**

గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల మూల్యాంకనం విషయంలో ఎలాంటి వివక్ష చోటుచేసుకోలేదని, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం మోడరేషన్ విధానంలోనే మూల్యాంకనం జరిగిందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) తరఫున సీనియర్ న్యాయవాది ఎస్. నిరంజన్ రెడ్డి హైకోర్టులో వాదించారు. తెలుగు భాషలో జవాబు రాసిన అభ్యర్థుల పట్ల ఎటువంటి వైఖరిలేదని స్పష్టం చేశారు. ఎవాల్యుయేటర్లకు టీఎస్‌పీఎస్సీ నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో ఓరియెంటేషన్, రిహార్సల్స్ నిర్వహించి తదుపరి పేపర్ల మూల్యాంకన చేపట్టినట్లు తెలియజేశారు.

పరీక్ష కేంద్రాల ఎంపిక విషయంలో విమర్శలు అవాస్తవమని వాదిస్తూ, కోఠి కేంద్రంలో ఎక్కువ మంది ఎంపికయ్యారన్న వాదన సరైనదికాదని, ఇతర కేంద్రాల్లో మరింత ఎక్కువ శాతం అభ్యర్థులు ఎంపికయ్యారని తెలిపారు. మహిళా విశ్వవిద్యాలయంలో కేవలం మహిళలకే కేంద్రాన్ని కేటాయించడం వెనుక వాస్తవ కారణాలున్నాయని, మౌలిక వసతుల కొరత కారణంగా పురుషులు ఇబ్బందులకు గురయ్యారన్న గత అనుభవాల దృష్ట్యా ఆ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

**మార్కులపై వివరణ**

ఒకే గదిలో కూర్చొని పరీక్ష రాసిన అభ్యర్థులకు ఒకే మార్కులొచ్చాయని చేస్తున్న ఆరోపణలు నిరాధారమని, సబ్జెక్టుల వారీగా మార్కులలో తేడాలు ఉన్నాయని చెప్పారు. ఎంపికైనవారిలో ఇంగ్లిష్ మీడియం అభ్యర్థులు 89.88%, తెలుగు మీడియం 9.95%, ఉర్దూ మీడియం 0.1% ఉన్నారని వెల్లడించారు.

న్యాయమూర్తి, అభ్యర్థులు తెలంగాణ చరిత్ర గురించి రాసిన సమాధానాలకు ఏ మేరకు మార్కులు ఇచ్చారో ఎలా నిర్ణయించారన్న అంశంపై స్పష్టత కోరారు. ఎవాల్యుయేటర్లకు మార్గదర్శకాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. దీనిపై పూర్తి వివరాలను సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని నిరంజన్ రెడ్డి హామీ ఇచ్చారు. పిటీషనర్ల తరఫు న్యాయవాదులు తమ ప్రతివాదనలు సోమవారం (జూలై 7)లోపు ముగించాలని, అవసరమైతే రాతపూర్వకంగా వాదనలు సమర్పించాలని హైకోర్టు సూచించింది. టీఎస్‌పీఎస్సీ నియామకాలపై ఉన్న స్టే ఎత్తివేయాలన్న పిటిషన్‌పై సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాష్ రెడ్డి రేపు వాదనలు వినిపించనున్నారు.

## రూ. 1.05 లక్షల కోట్ల విలువైన సైనిక పరికరాల కొనుగోలుకు ఆమోదం

- **రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో డీఏసీ సమావేశం**
- **పూర్తిగా దేశీయ కంపెనీల నుంచే సేకరణ**

(మొదటి పేజీ తరువాయి)

బ సదస్సులో మాట్లాడిన రాజ్?నాథ్ సింగ్, దేశీయ రక్షణ ఉత్పత్తులు రికార్డు స్థాయికి చేరాయని తెలిపారు. "పదేళ్ల క్రితం కేవలం రూ. 43,000 కోట్లుగా ఉన్న మన రక్షణ ఉత్పత్తి, ఇప్పుడు రూ. 1.46 లక్షల కోట్లను దాటింది. అదే విధంగా, రూ. 600–700 కోట్లుగా ఉన్న మన రక్షణ ఎగుమతులు నేడు రూ. 24,000 కోట్ల రికార్డును అధిగమించాయి" అని ఆయన వివరించారు. దేశ భద్రతకు, శ్రేయస్సుకు 'మేక్ ఇన్ ఇండియా' విధానం అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రయాణంలో 16,000కు పైగా ఎంఎస్‌ఎంఈలు భాగస్వాములై లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని మంత్రి తెలిపారు.

## సైబరాబాద్‌లో పదిమంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

**బలగం టీవి, హైదరాబాద్**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పదిమంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌ఓ రాజేష్‌ను సిసిఎస్ రాజేంద్రనగర్‌కు, కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌గా కె.వెంకటసుబ్బారావును నియమించారు. మియాపూర్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్‌ను సిసిఆర్‌బికి బదిలీ చేసి, శివప్రసాద్‌ను ఎస్‌హెచ్‌ఓగా, అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్‌ను బదిలీ చేసి, ప్రశాంత్‌ను అల్వాల్ ఎస్‌హెచ్‌ఓగా నియమించారు. విజయ్‌కుమార్‌ను సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్‌గా, సైబర్ క్రైంలో ఉన్న శ్రీనివాస రావును బాలానగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా, బాలానగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌ను బాచుపల్లి డిఐగా, బాచుపల్లి డిఐ యాదయ్య గౌడ్‌ను సిఎస్‌డబ్లూకు బదిలీ చేశారు. బదిలీ అయిన ఇన్‌స్పెక్టర్లు వెంటనే వారి స్థానాల్లో చేరాలని ఆదేశించారు.

## అమెరికాలో కాల్పుల కలకలం

- **నలుగురు మృతి, 14 మందికి గాయాలు**

**బలగం టీవి, హైదరాబాద్**



అమెరికాలో మరోసారి కాల్పుల మృత్యుకేళి చోటు చేసుకుంది. చికాగో నగరంలోని రివర్ నార్త్ ప్రాంతంలో బుధవారం రాత్రి జరిగిన డ్రైవ్–బై కాల్పుల్లో నలుగురు ప్రాణాలు కోల్పోగా, మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతను కలిగించింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, రివర్ నార్త్ ఏరియాలోని ఓ రెస్టారెంట్ వెలుపల గుంపుగా నిలబడి ఉన్న వారిపై గుర్తు తెలియని దుండగులు కారులో వచ్చి కాల్పులు జరిపి పరారయ్యారు. కాల్పులకు ముందు ఆ రెస్టారెంట్‌లో ఓ ర్యాప్ ఆల్బమ్ విడుదల కార్యక్రమం నిర్వహించారని స్థానిక మీడియా కథనాలు చెబుతున్నాయి.

గాయపడిన 14 మందిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. నార్త్‌వెస్టర్న్ మెడిసిన్ ప్రతినిధి క్రిస్ కింగ్ ప్రకారం, గాయపడిన పలువురికి చికిత్స అందిస్తున్నారు. అయితే, బాధితుల పూర్తివివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఘటనాస్థలంలో సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నట్టు సమాచారం. కాల్పుల వెనక గల కారణాలు, దుశ్చర్యకు పాల్పడిన వర్గాలు ఎవరన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

# ఖర్గే సభను విజయవంతం చేయాలి..

- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**బలగం టీవి, హైదరాబాద్**



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఈ నెల 4న రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఎల్బీ స్టేడియం వేదికగా భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభను విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఖర్గే పర్యటన నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, హైదరాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డిలతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దేశంలోనే తొలిసారిగా గ్రామ శాఖ అధ్యక్షులతో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేరుగా ముఖాముఖి సమావేశం కానున్నారని డిప్యూటీ సీఎం వివరించారు. ఇదే మొదటి ప్రయత్నంగా, ఈ వినూత్న కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రానికే తొలి గౌరవం దక్కినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ తరహా కార్యక్రమాలను అనంతరం దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్టు వివరించారు. ఇంతటి ముఖ్యమైన సభ నేపథ్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.

"సాయంత్రం 3 గంటలకల్లా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ శాఖ అధ్యక్షులు, మండల శాఖ నేతలు, జిల్లా అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో సభకు హాజరై విజయవంతం చేయాలి. ఖర్గే తో ప్రత్యక్షంగా మాట్లాడే అరుదైన అవకాశం ఇది. అందరూ బాధ్యతగా తీసుకోవాలి." ఈ సమావేశం ద్వారా కాంగ్రెస్ పార్టీ బలంగా పునఃప్రారంభం అయ్యే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తెలంగాణకు ఇచ్చిన ఈ అవకాశాన్ని పార్టీ నేతలు సద్వినియోగం చేసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు.

# వరద ప్రవాహానికి ఆటంకాలు కలిగించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఉండాల్సిన నాలా 10 మీటర్లకు పరిమితమవ్వడంతోనే జీడిమెట్ల నాలా పొడుగునా.. ఫతేనగర్, బాలానగర్ బస్తీలన్నీ నీట మునుగుతున్నాయని గుర్తించారు. వెంటనే జీడిమెట్ల నుంచి వచ్చే ఈ నాలాను డ్రోన్ కెమేరాతో పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు. ఫాక్స్‌సాగర్ చెరువు కిందన నాలాలో పోసిన మట్టిని వెంటనే తొలగించాలని హైడ్రా కమిషనర్ ఆదేశించారు.

అల్వాల్ మండలం యాప్రాల్ లో నాగిరెడ్డి కుంట కబ్జాలను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దాదాపు 19 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు 6 ఎకరాల వరకూ కబ్జాకు గురైందని గ్రహించారు. చెరువు గర్భంలో పోసిన మట్టిని తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాగిరెడ్డి కుంట నుంచి కాప్రా చెరువుకు వెళ్లాల్సిన వరద కాలువలు ఎక్కడికక్కడ దారితప్పడంతో పాటు.. కబ్జాలకు గురి కావడాన్ని హైడ్రా కమిషనర్ పరిశీలించారు. కొన్ని చోట్ల నాలాలకు ఏర్పడిన ఆటంకాలను తనిఖీ చేశారు. గోల్ఫ్ ఫ్రై డ్ హోమ్స్, మల్బార్ గీన్స్ విల్లాస్, హరిప్రియనగర్, గోల్ఫ్ వ్యూ ప్యారడైజ్, స్వర్ణాంధ్ర ఫేజ్ 01, 02 ఇలా పలు గేటెడ్ కమ్యూనిటీలలో వాగులు రూటు మారడాన్ని, కొన్ని చోట్ల ఆటంకాలు ఏర్పడడాన్ని హైడ్రా కమిషనర్ పరిశీలించారు. నాలా ఆరంభంలో ఎంత వెడల్పులో ఉందో.. కాప్రా చెరువులో కలిసే వరకూ అదే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడి వివిధ కాలనీ వాసులతో త్వరలోనే సమావేశం ఏర్పాటుచేసి.. గతంలో నాలాలు ఏ మార్గంలో వెళ్లేవి.. ఇప్పుడు వాటిని పునరుద్ధరించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు. హైడ్రా కమిషనర్ గారి ఆదేశాల మేరకు.. యాప్రాల్‌లోని స్వర్ణాంధ్ర ఫేజ్ 01కు వరద ముప్పును తప్పించే కాలువ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేశారు. మధ్యాహ్నం పరిశీలించగా.. ఆ వెంటనే హైడ్రా సహకారంతో మల్కాజిగిరి సర్కిల్ అధికారులు పనులు ప్రారంభించి పూర్తి చేశారు.



## భారత్‌కు రానున్న పాకిస్థాన్ జట్టు..!

**బలగం టీవి, హైదరాబాద్**

భారత్, పాకిస్థాన్‌ల మధ్య క్రీడా సంబంధాలపై అనిశ్చితి కొనసాగుతోంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఇరు దేశాల బోర్డులు అంతర్జాతీయ టోర్నీల్లోనే ఒకే గ్రూప్‌లో ఆడేందుకు నిరాకరించడమే అందుకు కారణం. ఈ క్రమంలోనే భారత్ ఈ ఏడాది ఆతిథ్యమిస్తున్న హాకీ ఆసియా కప్‌లో పాక్ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. అయితే.. ఆ దేశ క్రీడా శాఖ మంత్రిత్వ శాఖ మాత్రం తమ జట్టును ఇండియాకు పంపించేందుకు సిద్ధమవుతోంది. హాకీ ఆసియా కప్ టోర్నీ భారత్ వేదికగా ఆగస్టు 27న ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 27 వరకూ జరుగబోయే ఈ ఈవెంట్‌కు హాకీ ఇండియా సన్నాహకాలు చేస్తోంది. టోర్నమెంట్ సమీపిస్తున్న వేళ గురువారం పాకిస్థాన్ క్రీడా మంత్రిత్వ శాఖ భారత్‌కు తమ జట్టును పంపేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పింది. 'భారత్ వేదికగా జరుగబోయే పలు దేశాల టోర్నీలో మేము ఏ జట్టుకు వ్యతిరేకం కాదు. ఇదేమీ ద్వైపాక్షికి సిరీస్ కాదు. అంతర్జాతీయ క్రీడా నిబంధనలు మాకు తెలుసు. అందుకే మా జట్టును పోటీలకు పంపేందుకు అడ్డు చెప్పం. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం జరుగుతున్నా సరే ఆ దేశాల జట్లు పలు వేదికలపై పోటీ పడ్డాయి. కాబట్టి.. పాక్ జట్టుకు ఆసియా కప్ ఆడేందుకు అనుమతిస్తున్నాం' అని పాక్ క్రీడా శాఖ సన్నిహిత వర్గాలు తెలిపాయి. అయితే.. సెప్టెంబర్‌లో టీ20 ఫార్మాట్‌లో జరుగబోయే ఆసియా కప్‌లో దాయాదులు తలపడుతాయా? అనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఈ విషయంపై బీసీసీఐ అభిప్రాయం వెలిబుచ్చాకే తమ మాట చెప్పాలని క్రీడా మంత్రిత్వ శాఖ భావిస్తున్నట్టు సమాచారం.

## 5న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్.రాంచందర్‌రావు బాధ్యతల స్వీకరణ

**బలగం టీవి, హైదరాబాద్**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్ రాంచందర్ రావు ఎన్నికైన తర్వాత జూలై 5 తేదీన బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటగా జులై 5 తేదీ ఉదయం 9 గంటలకు అసెంబ్లీ దగ్గర్లో ఉన్న గన్ పార్క్‌లో అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తారన్నారు. తర్వాత ఉదయం 10 గంటలకు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ నాయకులు, కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, బిజెపి రాష్ట్ర పదాధికారులు, బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొంటా రన్నారు. అనంతరం 11 గంటలకు భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయంలో పూజలు నిర్వహిస్తారన్నారు.

## అంగన్వాడీ సహాయకులకు శుభవార్త

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణలోని అంగన్వాడీ సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక శుభవార్తను అందించింది. అంగన్వాడీ టీచర్లుగా పదోన్నతి పొందేందుకు ఉన్న గరిష్ఠ వయోపరిమితిని పెంచుతూ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం ద్వారా వేలాది మంది సహాయకులకు ప్రయోజనం చేకూరనుంది.ఇంతవరకు అంగన్వాడీ సహాయకుల నుంచి టీచర్లుగా పదోన్నతి పొందాలంటే గరిష్ఠ వయసు 45 ఏళ్లుగా ఉండేది. తాజాగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఈ నిబంధనను సవరించి, వయోపరిమితిని 50 ఏళ్లకు పెంచింది. ఈ మార్పునకు సంబంధించిన ఫైలుపై ఆ శాఖ మంత్రి సీతక్క గురువారం సంతకం చేసి ఆమోదం

# భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక



- ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్
- శ్రీ పార్వతీ రాజరాజేశ్వర అఖిల భారత వేద శాస్త్ర స్మార్త ఆగమ విద్వత్ సదస్సు

**బలగం టీవీ, వేములవాడ**

భారతదేశం సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని, హైందవ సంస్కృతిలోని వేదాలను ప్రపంచంలోని ఇతర దేశాలు ఆచరిస్తున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.గురు వారం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ రాజరాజేశ్వర వేద ఆగమ సంస్కృత విద్యాలయ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో దేశా వ్యాప్తంగా మొట్టమొదటి సరిగా నిర్వహిస్తున్న శ్రీ పార్వతీ రాజరాజేశ్వర అఖిల భారత వేద శాస్త్ర స్మార్త ఆగమ విద్వత్ సదస్సు కోసం ముఖ్యఅతిథిలు గా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తుని పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి లు హాజరయ్యారు.శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహింనారు

ఈ సందర్బంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూదేశవ్యాప్తంగా వేద పండిత విద్యార్థులకు నిర్వహించే చతుర్వేద స్మార్త పరీక్షలు తెలంగాణ రాష్ట్రంలో వేములవాడ లో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. తుని పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి వారికి ఈ ప్రాంత ప్రజల తరపున స్వాగతం పలుకుతున్నమని,ఈ రోజు సుదినంగా భావిస్తున్నామని అన్నారు.నాలుగు వేదాలు చదివే పాఠశాల ఒక్క వేములవాడ లో నే ఉందని,వేద పండితులకు జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షలు శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో నిర్వహించడం అభినందనీయమని అన్నారు.ఇదివరకు తిరుమల తిరుపతి లో నిర్వహించే పరీక్షలు, నేడు రాజన్న సన్నిధిలో నిర్వహించి వారికి పట్టాలు పంపిణీ చేయడం మన ప్రాంత అదృష్టం అని,ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కు ధన్యవాదాలు తెలిపారు.

రాజన్న ఆశీస్సులతో దేవయాలయ విస్తరణ ,అభివృద్ధి చేస్తున్నామని,ప్రజా ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి మొదటి దశలో 150 కొట్లు కేటాయించడం జరిగిందని అన్నారు. స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు వేలాదిగ వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడం కోసం కృషి చేస్తున్నామని,రాజన్న ఆలయాన్ని 4 ఎకరాల్లో విస్తరణ చేస్తున్నామని అన్నారు. ఇలాంటి సందర్భంలో జాతీయ స్థాయిలో నిర్వహించే వేద పరీక్షలు వేముల వాడ రాజన్న సన్నిధిలో నిర్వహించడం శుభ సూచకమని, రాజన్న ఆలయానికి మరింత ప్రచారం లభిస్తుందని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న నాలుగు గోశాలలో ఒకటి వేములవాడలో నిర్మిస్తున్నామని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో సువిశాలమైన గోశాల నిర్మాణానికి 40 ఎకరాల స్థల సేకరణ చేయడం జరిగిందని,త్వరలోనే అధునాతన గోశాల నిర్మాణం చేపడతమని అన్నారు.గత అసెంబ్లీ సమావేశంలో వేములవాడ లో వేద యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీ కోరడం జరిగిందని అన్నారు.

శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి మాట్లాడుతూ శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం ప్రముఖ పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతుందని,చాలా సార్లు స్వామి వారిని దర్శించుకువడం జరిగిందని అన్నారు. ఆలయానికి చాలా ప్రాచీన ప్రాముఖ్యత కలిగి ఉందని,ప్రభుత్వం తలపెట్టిన రాజన్న ఆలయ విస్తరణ ఎలాంటి ఆటంకం లేకుండా విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో జరగాలని ఆకాంక్షించారు. స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు మెరుగైన వసతులు,దర్శన భాగ్యం కల్పించే విధంగా చర్యులు తీసుకుంటున్నందుకు అభినందనలు తెలిపారు.

## ఆత్మ నిర్బర్ సంఘాతన్ అవార్డుకు
# ఇల్లంతకుంట మండల సమాఖ్య ఎంపిక

- ఇల్లంతకుంట మండల ఆదర్శ సమాఖ్యకు జాతీయస్థాయి అవార్డు ఆగస్టు 15న దేశ రాజధానికి రావాలని ఆహ్వానం
-అభినందించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా




**బలగం టీవీ, సిరిసిల్ల**

స్వయం సహాయక సంఘాలకు విశిష్ట సేవలందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటున అందిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్య జాతీయస్థాయి అవార్డుకు ఎంపికైంది. వచ్చే నెల ఆగస్టు 15వ తేదీన ఢిల్లీలో నిర్వహించనున్న అవార్డుల ప్రధాన ఉత్సవానికి రావాల్సిందిగా ఆహ్వానం అందింది. జిల్లాలోని మండల సమాఖ్య జాతీయస్థాయి అవార్డుకు ఎంపిక అవడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. వారిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేకంగా అభినందించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలోని ఆదర్శ మండల సమాఖ్య ఎస్ హెచ్ జి స్వయం సహాయక సభ్యులకు సేవలందిస్తోంది. ఈ మండల సమాఖ్య పరిధిలో 46 విలేజ్ ఆర్గనైజేషన్(వీ ఓ)లు ఉండగా 1103 స్వయం సహాయక సంఘాలు 11వేలకు పైగా మహిళలు సభ్యులుగా ఉన్నారు.

**ఆర్థిక, సామాజిక సేవలు అందిస్తూ..**

ఆదర్శ మండల సమాఖ్య ఆధ్వర్యంలో గత ఐదేళ్ల కు పైగా ఎస్ హెచ్ జి సభ్యులకు రుణాలు అందించడం వాటిని క్రమం తప్పకుండా చెల్లించేలా చూడడం సభ్యులకు భీమా కల్పించడం తదితర సేవలు అందిస్తుంది. ఎస్ హెచ్ జీ సభ్యులు వివిధ వ్యాపారాల్లో రాణించేలా నిరంతరం శిక్షణ, సలహాలు అందిస్తున్నారు. అలాగే సామాజిక బాధ్యత కింద అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, నీటి వనరుల సంరక్షణ ప్లాస్టిక్ వినియోగించవద్దని, సైబర్ మోసాలకు గురి కావద్దని తదితర అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు మహిళా సంఘాల సభ్యులు జీవనోపాదులు పెంచే కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారు.

**22 సీఎల్ఎఫ్ లు ఎంపిక**

దేశవ్యాప్తంగా ఉత్తమ సేవలందిస్తున్న మండల సమాఖ్యలకు అవార్డులు అందించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమాఖ్యల పనితీరును పరిశీలించారు. దీన్ దయాల్ అంత్యోదయ యోజన జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ లో భాగంగా ఉత్తమ సేవలు అందిస్తున్న మండల సమాఖ్యలను గుర్తించి లిఆత్మ నిర్బర్ సంఘాతన్ అవార్డు 2024లి ప్రధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి 22 మహిళా సంఘాలను ఎంపిక చేసింది. అవార్డులకు దేశంలోని ఆరు రీజియన్ల పరిధిలో 22 క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్లు(సీఎల్ ఎఫ్)లు ఎంపిక కాగా.. సదరన్ రీజియన్ కింద రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండల ఆదర్శ సమాఖ్య రెండో స్థానంలో నిలిచి ప్రతిభ చూపింది. ఈ సందర్భంగా వారి సేవలను గుర్తిస్తూ కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖకు లేఖ అందింది. రానున్న ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోట వద్ద నిర్వహించనున్న అవార్డుల ప్రదాన ఉత్సవానికి రావలసిందిగా ఆహ్వానం అందింది. ఆదర్శ మండల సమాఖ్య బాధ్యులు అక్కడికి వెళ్లి అవార్డును స్వీకరించనున్నారు.

**కలెక్టర్ అభినందనలు**



ఇల్లంతకుంట మండలం ఆదర్శ మహిళా సమాఖ్య ఉత్తమ సేవలందించి జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికవ డంతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి, అలాగే మండల సమాఖ్య బాధ్యులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేకంగా అభినందించారు. దీనికి కృషి చేసిన సభ్యులందరికీ అభినందనలు తెలిపారు.

## మహిళలు,విద్యార్థినిలు ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా సంప్రదించండి

**- ఎస్పీ మహేష్ బి.గితే**



**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేష్ బి.గితే ఓ గురువారం ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు అభద్రత బావనికి గురైనప్పుడు భయపడొద్దని,ధైర్యంగా ముందుకు వచ్చి షీ టీం కి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.జిల్లాలో మహిళల, విద్యార్థినిల రక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోందని ప్రధానంగా మహిళలు, విద్యార్థినిలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, మీ వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దని అన్నారు.ముఖ్యంగా సామాజిక మాద్యమాల్లో పరిచమయమ్యే వ్యక్తులతో మరింత అప్రమత్తం వుండాలని సూచించారు.మహిళలు తాము పనిచేసే ప్రదేశాల్లోగాని,మరేక్కడ్కైన ల్కైంగిక వేధింపులకు గురౌవుతున్న,ర్యాగింగ్ లాంటి వేధింపులకు గురౌవుతున్న మహిళలు, విధ్యార్థునులు,బాలికలు మౌనంగా ఉండకుండా, ధ్కైర్యంగా పిర్యాదు చేయాలని అన్నారు.ఎవరైనా ఆకతయులు మహిళలను,యువతులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యాసంస్థలల్లోఎవరైనా వేధించిన,రోడ్డుపై వెళ్లేటప్పుడు,పని చేసే ప్రదేశాల్లో అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనేజిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 పిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యాలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు.

## శ్రీ రాజరాజేశ్వర జలాశయం నిర్వాసితుల పట్టా ప్యాకేజీ కొరకు దరఖాస్తుల స్వీకరణ

**బలగం టీవీ, బోయినిపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర జలాశయం (మిడ్ మానేర్) నిర్వాసితులు 2015 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి పట్టాతో పాటు ప్యాకేజీ కోసం దరఖాస్తులను గ్రామంలో బోయినిపల్లి తహశీల్దార్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గురువారం రోజున దరఖాస్తుల స్వీకరణ నిర్వహించడం జరిగింది.దరఖాస్తు సేకరణలో బాగంగా తహశీల్దార్ నారాయణరెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ: మిడ్ మానేర్ లో చాలా మందికి పట్టా ప్యాకేజీ రాలేదనే ఉద్దేశంతో ఈ దరఖాస్తులను తీసుకోవడం జరుగుతుందని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకులకు పట్ట ప్యాకేజీ ఇప్పించలనే ఉద్దేశంతో, అలాగే నిర్వాసితుల సమస్యలు తీర్చాలానే ఉద్దేశంతో చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,కలెక్టర్ తో మాట్లాడి,ప్రభుత్వం దృష్టికి తీసుకెల్లి, ప్రతి ఒక్కరికి న్యాయం జరగాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారని,పట్టా వచ్చి ప్యాకేజీ రాకపోయినా, ప్యాకేజీ వచ్చి పట్టా రాకపోయినా, గెజిట్ లో ఉన్న ప్రతి ఒక్కరికి పట్టా ప్యాకేజీ కోసం కోదురుపాక గ్రామపంచాయతీలో దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు.

## రాజన్న ఆలయ ప్రాంగణంలో ఉన్న హజరత్ బాబా సమాధిని తొలగించాలి..

**-రాజన్న భక్తుడు మారవేని రంజిత్ కుమార్**



**బలగం టీవీ, సిరిసిల్ల**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో గల హజరత్ బాబా సమాధిని తొలగించాలని మారవేని రంజిత్ కుమార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా వినతిపత్రం పంపారు.ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ, “పవిత్ర శివలింగంపై మూత్ర విసర్జన చేసిన హజరత్ బాబా సమాధిని దేవాలయ ప్రాంగణంలో ఉంచడం హిందూ ధర్మాన్ని కించపరచే చర్య. ఇది ఆలయ పవిత్రతకు మంగళంకరం” అని అన్నారు.ఇలాంటి వ్యక్తి సమాధి చుట్టూ మజార్ ధోరణిలో ప్రార్థనలు, మతపరమైన నినాదాలు జరుగుతుండటం ఆలయ ఆగమ నియమాలకు విరుద్ధమని, హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందన్నారు. దేవాలయ ప్రాంగణంలో అప్రామాణిక నిర్మాణాలు మతసామరస్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

అలాగే, “ఖురాన్ ప్రకారమే అల్లా ఒక్కడే దేవుడని చెప్పబడిన తరుణంలో, ముస్లింలే ఇటువంటి మజార్ నిర్మాణాలను సమర్థించలేరని,కనుక మతాల మధ్య బాహ్య ఉద్రేకాలకు తావివ్వకుండా, మతాల గౌరవాన్ని పరిరక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి అన్నారు. అలాగే, ఆలయ పరిసరాల్లో ఉన్న ఈ సమాధిని ఇతర అనుకూల ప్రదేశానికి తరలించి, ఆ ప్రాంతాన్ని పూర్తిగా హిందూ సంప్రదాయాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ని కోరారు. ఇది హిందూ భక్తుల మనోభావాలకు గౌరవం కల్పించడమే కాక, మతసామరస్యాన్ని పరిరక్షించే చర్య కూడా అవుతుందిని స్పష్టం చేశారు.

**కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గురువారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయురాళ్లు చేతులకు గోరింటాకు పెట్టించుకుంటూ ఆనందంగా సందడి చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకునే సంప్రదాయ విశిష్టతను వివరించారు. పాతకాలం నుంచీ ఆధ్యాత్మికత, సాంస్కృతిక నేపథ్యంతో కూడిన ఈ వేడుకల ద్వారా భారత సంప్రదాయ విలువలు విద్యార్థులకు పరిచయం అవుతున్నట్లు చెప్పారు. ప్రతి ఏటా ఆషాఢ మాసంలో ఈ సాంప్రదాయాన్ని పాటిస్తూ పాఠశాలలో గోరింటాకు వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతున్నదన్నారు.**

## సెమీఫైనల్లో హితేశ్, సాక్షి

### ఇండియా ఖాతాలో ఐదో పతకం ఖాయం



**బలగం టీవీ, హైదరాబాద్**

వరల్డ్ బాక్సింగ్ కప్‌లో భారత బాక్సర్లు రాణిస్తున్నారు. ఇప్పటికే మూడు పతకాలు ఖారారైన ఈ టోర్నీలో, గురువారం నాడు పురుషుల విభాగంలో హితేశ్ గులియా, మహిళల విభాగంలో సాక్షి సెమీఫైనల్ చేరారు. దాంతో భారత ఖాతాలో ఐదో పతకం ఖాయమైంది.

పురుషుల 70 కిలోల విభాగంలో పోటీపడుతున్న హితేశ్ గులియా, కజకిస్థాన్‌కు చెందిన స్థానిక బాక్సర్ అల్మాజ్ ఒరోజ్‌బెకొవ్‌ను క్వార్టర్ ఫైనల్లో 5–0 తేడాతో చిత్తు చేశాడు. ఈ విజయంతో హితేశ్ పసిడి పోరుకు మరింత చేరువయ్యాడు. ఈ ఏడాది ప్రారంభంలో బ్రెజిల్ వేదికగా స్వర్ణం సాధించిన హితేశ్, మరోసారి తన పోరాటశక్తిని నిరూపించాడు. మహిళల 54 కిలోల విభాగంలో సాక్షి బ్రెజిల్‌కు చెందిన తతియనా రెజీనా జీసస్ చగాస్‌పై ఏకపక్షంగా విజయం సాధించింది. ప్రత్యర్థి నుంచి ఎలాంటి ప్రతిఘటన లేకపోవడంతో సాక్షి తక్కువ సమయంలోనే సెమీస్ చేరింది.

బుధవారం జరిగిన బౌట్స్‌లో మీనాక్షి (48 కిలోలు), పూజా రాణి (80 కిలోలు), సంజూ (60 కిలోలు)లు ఇప్పటికే సెమీఫైనల్ చేరగా, అనామిక (51 కిలోలు) క్వార్టర్ ఫైనల్ కోసం రెడీగా ఉంది. దాంతో ఈసారి మరిన్ని పతకాలు భారత్ ఖాతాలో చేరే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ఎక్కడ పోటీ జరిగినా తాము అగ్రగాములమనే విషయంలో భారత బాక్సర్లు తమ పంచ్‌తో నిరూపిస్తున్నారు. హితేశ్, సాక్షిలు అద్భుత ఫామ్ కొనసాగించడంతో భారత్‌కు బంగారు ఆశలు మెరవుతున్నాయి.

## డబుల్ సెంచరీతో చరిత్ర సృష్టించిన గిల్..

**బలగం టీవీ, హైదరాబాద్**




భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో డబుల్ సెంచరీ సాధించాడు. చిన్నవయసులోనే ద్విశతకం బాదిన భారత మూడో కెప్టెన్‌గా ఘనత సొంతం చేసుకున్నాడు. గిల్ 23 ఏళ్ల 298 రోజుల్లో ఈమైలురాయికి చేరుకున్నాడు. మాస్టర్ బ్లాస్టర్ సచిన్, విరాట్ కోహ్లీలను అతడి వెనకే ఉండడం విశేషం. 23 ఏళ్ల 398రోజుల్లోనే డబుల్ సెంచరీ కొట్టేసిన మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. సచిన్ 26 ఏళ్ల 189 రోజుల్లో, కోహ్లీ 27 ఏళ్ల 260 రోజుల్లో డబల్ క్లబ్‌లో చేరారు. మొత్తంగా ఇంగ్లండ్ నేలపై ద్విశతకం బాదిన తొలి భారత కెప్టెన్‌గా గిల్ రికార్డు సృష్టించాడు. అజారుద్దీన్ 179 పరుగులతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.మొత్తంగా విదేశీ గడ్డపై రెండొందలు బాదిన ఆరో సారథిగా మరో మైలురాయికి చేరువయ్యాడీ యంగ్‌స్టర్. అతడి కంటే ముందు విరాట్ కోహ్లీ, మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ, సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోనీ ఈ ఘనత సాధించారు.

## కారు ప్రమాదంలో

# ఫుట్‌బాల్ స్టార్ మృతి

### ప్రపంచ ఫుట్‌బాల్‌లో విషాదం

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రఖ్యాత పోర్చుగీస్ ఫుట్‌బాల్ ఆటగాడు, లివర్‌పూల్ ఫార్వర్డ్ డియోగో జోటా (28) బుధవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఈ ప్రమాదంలో అతనితో పాటు అతని సోదరుడు ఆండ్రీ సిల్వా కూడా దుర్మరణం పాలయ్యారు. స్థానిక మీడియా వివరాల ప్రకారం, స్పెయిన్‌లోని జమెరా నగరంలో అర్ధరాత్రి 12.40 గంటల సమయంలో వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లడంతో ప్రమాదం చోటు చేసుకుంది. కారు టైర్ పేలిన కారణంగా మంటలు చెలరేగాయి. అప్పటికే డియోగో జోటా, ఆయన సోదరుడు కారులోనే ఉండగా, ఇద్దరూ అగ్నికి ఆహుతయ్యారు.

ఇటీవలే డియోగో జోటా తన చిన్ననాటి స్నేహితురాలు రూట్ కార్డోసోను వివాహం చేసుకున్నాడు. పెళ్లికి ముందే ఆమెతో సహజీవనం చేస్తూ ముగ్గురు పిల్లలకు తల్లిదండ్రులైన ఈ దంపతుల జీవితంలో ఘోర విషాదం చోటుచేసుకుంది.డియోగో జోటా మరణాన్ని పోర్చుగీస్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ అధికారికంగా ధ్రువీకరించింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షుడు పెడ్రో ప్రోయెంకా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. "జోటా ప్రతిభావంతుడే కాకుండా, మా దేశ ఫుట్‌బాల్ గర్వంగా నిలిచిన ఆటగాడు. ఆయన మృతి మన దేశానికి తీరనిలోటు," అని తెలిపారు. డియోగో సోదరుడు ఆండ్రీ సిల్వా కూడా ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ ప్లేయరే కావడం గమనార్హం. అతను పోర్చుగల్ రెండో డివిజన్ జట్టు పెనాఫీల్ తరఫున ప్రాతినిధ్యం వహించేవాడు. జోటా హఠాన్మరణం వార్తతో అభిమానులు, ఆటగాళ్లు, క్రీడా రంగం మొత్తం విషాదంలో మునిగిపోయింది. లివర్‌పూల్ క్లబ్, ఫుట్‌బాల్ సంఘాలు, మాజీ లెజెండ్లు సోషల్ మీడియాలో తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# భారత్‌దే ఆధిపత్యం

**బలగం టీవీ, హైదరాబాద్**





ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో భారత్ పూర్తి ఆధిపత్యాన్ని కనబరుస్తోంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అద్భుత డబుల్ సెంచరీతో (269 పరుగులు) భారత్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు నమోదు చేసింది. తరువాత, పేసర్లు ఆకాశ్ దీప్, సిరాజ్‌లు మెరుపులు మెరిపించడంతో ఇంగ్లండ్ కష్టాల్లో పడింది.

భారత ఇన్నింగ్స్‌లో కెప్టెన్ గిల్ చెలరేగిపోయాడు. 269 పరుగులు చేయడంతో టీమిండియా స్కోరు 587 పరుగుల వద్ద ఆల్‌ఔట్ అయింది. భారీ స్కోర్ ఒత్తిడిలో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ఆరంభించగా, భారత పేసర్ ఆకాశ్ దీప్ బిగ్ బ్రేక్ ఇచ్చాడు. ఓపెనర్ బెన్ డకెట్ (0)ను తొలిసారి బౌల్డ్ చేయగా, అదే ఓవర్లో ఓలీ పోప్ (0)ను గోల్డెన్ డక్‌గా వెనక్కి పంపాడు. మరో ఓపెనర్ జాక్ క్రాలే(19)ను సిరాజ్ ఔట్ చేశాడు. దీంతో ఆతిథ్య జట్టు 13 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయింది. తర్వాత జో రూట్ (18 నాటౌట్), హ్యారీ బ్రూక్ (30 నాటౌట్) జత కట్టారు. చివరి నలభై నిమిషాల పాటు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశారు. రెండో రోజు ఆట ముగిసే సరికి ఇంగ్లండ్ 3 వికెట్లు కోల్పోయి 77 పరుగులు చేసింది. ఇంకా 510 పరుగుల వెనుకంజలో ఉంది.

ఇప్పటికే తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం తీసుకున్న భారత్, మిగిలిన వికెట్లను త్వరగా తీసుకుంటే మ్యాచ్‌పై పట్టు మరింత బలపడనుంది. ఇక గిల్ చెలరేగిన బ్యాటింగ్‌తో పాటు బౌలర్ల ధాటికి భారత్ విజయానికి దాదాపు అడుగు దూరంలో ఉందని చెప్పవచ్చు.

కెప్టెన్ శుభ్‌మన్ గిల్(269) చరిత్రలో నిలిచేపోయే ఇనన్నింగ్స్ ఆడగా .. రవీంద్ర జడేజా(89), ఓపెనర్ యశస్వి జైస్వాల్(87) భాగమయ్యారు. రెండో రోజు గిల్ ద్విశతకంతో కదం తొక్కిన వేళ టీమిండియా పటిష్ఠ స్థితిలో నిలిచింది. అయితే.. ఆరొందలకు మరో 13 పరుగలు దూరంలోనే ఆగిపోయింది.ఆకాశ్ దీప్(6) పెద్ద షాట్‌కు యత్నించి బెన్ డకెట్‌కు సులువైన క్యాచ్ ఇచ్చాడు. బషీర్ బౌలింగ్‌లో సిరాజ్(8) పిచ్ వదిలి షాట్ ఆడబోయి స్టంపౌట్ అయ్యాడు. దాంతో, 587 వద్ద భారత జట్టు తొలి ఇన్నింగ్స్ ముగిసింది.

## "మన వారసత్వానికి ప్రతీకగా 'రామాయణం'" : నిర్మాత నమిత్

**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న మహా ప్రాజెక్ట్ 'రామాయణం' ఫస్ట్ గ్లింప్స్‌ను చిత్ర బృందం గురువారం విడుదల చేసింది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత నమిత్ మల్హోత్రా మాట్లాడుతూ, "రామాయణం కేవలం ఒక కథ కాదు, అది మన సంస్కృతి, మన సత్యానికి ప్రతీక. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడిని కలిపే శక్తి ఉన్న గాథ ఇది. మేము చరిత్రను తిరిగి చెప్పడం కాదు... మన వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నాము" అని పేర్కొన్నారు. గతంలో వచ్చిన రామాయణ సినిమాలన్నింటికంటే భిన్నంగా, విశిష్టంగా ఈ వెర్షన్ ఉండబోతుందని చెప్పారు.

## క్షీణించిన ఫిష్ వెంకట్ ఆరోగ్యం

- **సాయం కోసం కుమార్తె విజ్ఞప్తి**

**బలగం టీవీ, హైదరాబాద్**



టాలీవుడ్ నటుడు ఫిష్ వెంకట్ ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసిందే. వెంకట్ ఆరోగ్యం మరింత క్షీణించిందని, ఎదుటి వ్యక్తిని గుర్తుపట్టలేనంత తీవ్ర అనారోగ్యంతో ఉన్నారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రస్తుతం బోడుప్పల్‌లోని ఆర్బీఎం ఆస్పత్రిలో వెంకట్ చికిత్స తీసుకుంటున్నారు. అయితే అతడి కిడ్నీలు మార్పిడి చేయకపోతే అతడు బతకడం కష్టమని వైద్యులు తెలిపినట్లు వెంకట్ కూతురు స్రవంతి వెల్లడించింది. ప్రస్తుతం తాము వైద్య సేవలు పొందలేని దీన స్థితిలో ఉన్నామని, దాతలు ఎవరైనా తమకు సాయం చేయాలని స్రవంతి కోరుతున్నారు. దాతలు ముందుకు రావాలని నటుడి భార్య, కూతురు చేతులెత్తి మొక్కుతున్నారు.

ఫిష్ వెంకట్ గత కొద్ది నెలలుగా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో గతంలో డయాలసిస్ చికిత్స తీసుకున్నారు. అయితే ప్రస్తుతం వెంకట్ ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఐసీయూలో చేర్చారు. గతంలో ఫిష్ వెంకట్ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పుడు ఏపీ డిప్యూటి సీఎం పవర్ స్టార్ పవన్ కల్యాణ్ రూ. 2 లక్షల ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు.




## రామాయణ' ఫస్ట్ గ్లింప్స్

**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ రాముడిగా, ప్రముఖ నటి సాయి పల్లవి సీతగా నటిస్తున్న ప్రతిష్మాత్మక చిత్రం 'రామాయణ' నుంచి తాజాగా ఓ ప్రత్యేక గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. మూడు నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. బాలీవుడ్ దర్శకుడు నితీశ్ తివారీ ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. రామాయణ గాథ ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మొదటి నుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి.

## 'హరి హర వీరమల్లు' ట్రైలర్ వచ్చేసింది




**బలగం టీవీ, హైదరాబాద్**

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన 'హరి హర వీరమల్లు' సినిమా ట్రైలర్ విడుదలైంది. మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన వీరమల్లు అనే యోధుడి పాత్రలో పవన్ పవర్‌ఫుల్‌గా కనిపించారు. ట్రైలర్‌లోని భారీ యాక్షన్ సన్నివేశాలు, పవర్‌ఫుల్ డైలాగ్స్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. ఈ చిత్రంలో సనాతన ధర్మాన్ని కాపాడే వీరుడిగా, కోహినూర్ వజ్రాన్ని దక్కించుకోవడానికి మొఘలులను ఢీకొట్టే వీరమల్లుగా పవర్‌స్టార్ కనిపించనున్నారు. క్రూరమైన మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు పాత్రలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ కనిపిస్తున్నారు. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తుండగా, నాజర్, నార్గిస్ ఫక్రీ, అనుపమ్ ఖేర్, సుబ్బరాజు, సునీల్, విక్రమ్‌జీత్ విర్క్, నోరా ఫతేహి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. క్రిష్, జ్యోతి కృష్ణ ఈ చారిత్రక కథను భారీ హంగులతో తెరకెక్కించారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అందించిన నేపథ్య సంగీతం సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. పవన్ సరసన నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్ పతాకంపై ఏ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ట్రైలర్‌లో "ఆంధీ వచ్చేసింది" అనే డైలాగ్ అభిమానులకు గూస్‌బంప్స్ తెప్పిస్తోంది.